కొత్త బస్టాండ్ నిర్మాణానికి అడుగులు

- కోదాడలో బస్టాండ్ నిర్మాణానికి రూ.17 కోట్లు మంజూరు
- 15న నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి ఉత్తమ్
- ఆధునిక హంగులతో నిర్మించేలా అధికారుల ప్రణాళిక



కోదాడ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ

కోదాడ : పట్టణంలో ప్రస్తుతమున్న బస్టాండ్ ఆవరణలో కొత్త బస్టాండ్ భవనం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. రూ.17 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మించబోతున్నారు. బస్టాండ్ నిర్మాణ పనులకు ఈ నెల 15న రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అయితే బస్టాండ్ నిర్మాణానికి మొదట రు. 24 కోట్ల రూపాయలు ప్రతిపాదించినప్పటికి ఇక్కడి అవసరాలకు రూ.17 కోట్లు సరిపోతాయని ఆర్టీసీ ఉన్నతాధికారులు చెప్పడంతో గతంలో తయారు చేసిన ప్లాన్‌లో మార్పులు చేసి తాజాగా కొత్త ప్లాన్ ఆమోదించి ఆధునిక హంగులతో బస్టాండ్ నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు.

అసౌకర్యాలతో ఇబ్బంది..

విజయవాడ– హైదరాబాద్ మధ్యలో ఉన్న కోదాడ ప్రస్తుత బస్టాండ్‌ను 1972లో నిర్మించారు. అంతకు ముందు కోదాడ బస్టాండ్ ప్రస్తుత కూరగాయల మార్కెట్‌లో ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జగ్గయ్యపేట డిపోకు చెందిన బస్సులు కూడా కోదాడ ప్రాంతంలో నడిపేవారు. కాలక్రమేణా 1990 సంవత్సరంలో కోదాడ బస్టాండ్ ఆవరణలోనే నూతనంగా డిపో ఏర్పాటు చేశారు. అయితే గతంలో విజయవాడ– హైదరాబాద్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సుల డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడానికి ఇక్కడ రెండు అంతస్తుల భవనాలు కూడా ఉండేవి. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయి. బస్టాండ్ ఆవరణ విశాలంగా ఉన్నప్పటికి అస్తవ్యస్తంగా నిర్మాణాలు ఉండడంతో పాటు సరైన పద్ధతిలో నిర్వహణ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో వాహనాల పార్కింగ్ స్థలం, మలమూత్రశాలలు, తాగునీటికి సరైన వసతి లేకపోవడం, విశ్రాంతి గదుల సౌకర్యం, క్యాంటీన్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

ఆధునిక హంగులతో..

నూతన బస్టాండ్ నిర్మాణంతో ప్రస్తుతం బస్టాండ్‌లో నెలకొన్న అసౌకర్యాల నుంచి విముక్తి కలుగుతుందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుత బస్టాండ్‌లో డిపో గోడ వైపు ఖాళీగా ఉన్న స్థలంలో ఉత్తరం వైపు నూతన బస్టాండ్‌ను ఆధునిక హంగులతో నిర్మించనున్నట్లు సమాచారం. ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలతో పాటు ఏసీ విశ్రాంతి గదులను కూడా ఏర్పాటు చేయనున్నారు. కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయిన తరువాత పాత బస్టాండ్‌ను పూర్తిగా తొలగించి జాతీయ రహదారి వైపు కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



క్రీడా పోటీల్లో పాల్గొన్న జడ్జి సురేష్, న్యాయవాదులు

కోదాడరూరల్ : మానసిక ఉల్లాసానికి క్రీడా పోటీలు దోహద పడతాయని సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని కోర్టులో న్యాయవాదులు ఏర్పాటు చేసుకున్న క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. న్యాయవాదులు తమ వృత్తిలో పనిఒత్తిడిని జయించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, రామిశెట్టి రామకృష్ణ, ఉయ్యాల నర్సయ్య, బండారు రమేష్ బాబు, వై.సుధాకర్‌రెడ్డి, మేకల వెంట్రావ్, హనుమంతరావు, రంజాన్‌పాషా, శరత్‌బాబు, సిలివేరు వెంకటేశ్వర్లు, యశ్వంత్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

బీసీ గర్జన సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

చిలుకూరు : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన కరీంనగర్‌లో చేపట్టబోయే బీసీ గర్జన సభలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. సోమవారం చిలుకూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని సాకులు చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం సమయం గడుపుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, బీఆర్‌ఎస్ నాయకులు శెట్టి సురేష్‌నాయుడు, ముత్తారపు రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



నగదు, మోటివేషనల్ మెటీరియల్ అందజేస్తున్న దాతలు, ఎంఈఓ

చిలుకూరు : పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురవయ్య అన్నారు. చిలుకూరు మండలంలోని బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న 10 మంది విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉప్పల శ్రీనివాస్‌రావు, కెమిస్ట్రీ లెక్చరర్ ఉప్పల నరసింహారావు ప్రోత్సాహకంగా రూ.పది వేలను, మోటివేషనల్ మెటీరియల్‌ను ఎంఈఓతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఎంఈఓ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, చందా శ్రీనివాసరావు, వీరబాబు, శౌరి, వెంకన్న, ఉపేందర్, కల్పన, కృష్ణ, ప్రకాశం, వెంకటేశ్వర్లు, నరసింహారావు, లాల్, రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలి



హాస్పిటల్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్, మున్సిపల్ కమిషనర్

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, డాక్టర్లు, వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలి

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 3వ వార్డులో వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ అశోక్, ఆర్‌పీ మంజుల, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి నాయకుల పరామర్శ

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డ, మాచవరం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నాగయ్య యాదవ్ తల్లి గడ్డం లక్ష్మమ్మ ఆదివారం మృతి చెందారు. సోమవారం ఐఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో నాయకులు యరగాని భిక్షం, యరగాని గురవయ్య, మేకపోతుల వెంకయ్య, చిమట సైదులు, నాగరాజు, వీరబాబు, రాములు, నరేంద్ర బాబు, హనుమంతు, సత్యం, తదితరులు ఉన్నారు.

కోదాడ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



కోదాడరూరల్ : తొగర్రాయిలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



నడిగూడెం : పీఏసీఎస్ గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్ : కోదాడ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తొగర్రాయి, రెడ్లకుంటలో ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆరు మండలాల్లో శిథిలావస్థకు చేరుకున్న గ్రామ పంచాయతీ భవనాల ప్రదేశంలో విడతల వారీగా నూతన భవనాలు నిర్మించుకుందామని ఆమె తెలిపారు. రెడ్లకుంట గ్రామపంచాయతీ నూతన భవనం బాగుందని అన్నారు. భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ గంగవరపు లక్ష్మణ్‌రావును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీఓ సూర్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ ఇస్సాక్ హుస్సేన్, పీఆర్ ఏఈ రాము, మాజీ ఎంపీపీ మల్లెల రాణి, అమరనాయిని వెంకటేశ్వరరావు, లిక్కి వెంకటయ్య, గంగవరపు లక్ష్మణ్‌రావు, సాధినేని అప్పారావు, మల్లెల పుల్లయ్య కార్యదర్శులు అవినాష్, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

బాలుర పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తా

కోదాడ : కోదాడ బాలుర పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సందర్శించారు. పాఠశాలలో 600 మంది విద్యార్థులున్నారని, సరైన తరగతి గదులు లేక ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. 12 తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉందని వెంటనే పూర్తి చేయించాలని, ఆడిటోరియంలోకి వర్షపు నీరు వస్తున్నందున ఎత్తు పెంచాలని, వంటగదులు, డైనింగ్‌హాల్ నిర్మాణం పూర్తి చేయించాలని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏర్నేని బాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోదాడ : బాలుర పాఠశాలలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పద్మావతి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 6 మండలాలతో పాటు కోదాడ పట్టణానికి చెందిన 312 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 1,11,76,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పంపిణీ చేశారు.



నడిగూడెంలో ఎమ్మెల్యే పద్మావతికి చీర, సారె అందజేస్తున్న మాజీ సర్పంచ్ ఉషారాణి

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

నడిగూడెం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. నడిగూడెం మండల కేంద్రంలోని సహకార సంఘం నిధులు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన గోదాము, షాపింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరతమ్మ, స్థానిక సహకార సంఘం చైర్మన్ కొల్లు రామారావు, కాగితరామచంద్రాపురం సహకార సంఘం చైర్మన్ గోసుల రాజేష్, సీఈఓ కిరణ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పద్మావతికి సత్కారం

నడిగూడెం : కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి సోమవారం నడిగూడెంకు వచ్చిన సందర్భంగా శ్రావణమాసాన్ని పురస్కరించుకొని బృందావనపురంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ రేపాల ఉషారాణి, పురుషోత్తం దంపతులు చీర, సారె అందజేసి సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ జయ మనోహరి



కోదాడరూరల్: నెమలిపురి గురుకుల పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ



హుజూర్‌నగర్ : విద్యార్థికి మాత్ర వేస్తున్న మండల వైద్యాధికారి వేణుగోపాల్‌నాయక్

కోదాడరూరల్ : నులిపురుగుల నివారణకు విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయ మనోహరి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని నెమలిపురి కాలనీలో గల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఆరు నెలలకు ఓసారి రెండు సంవత్సరాలలోపు చిన్నారులకు సగం మాత్రను, ఆపై నుంచి 19 సంవత్సరాల లోపు వారికి ఒక మాత్రను వేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పుష్పలత, హెచ్ఈఓ ఉపేందర్, సీహెచ్ఓ సుమిత్ర, ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, మధుబాబు, మీనాకుమారి, వినోద్, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

మునగాల : 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.రవీందర్ కోరారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మాత్రల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఏఎన్ఎం లక్ష్మి, పాఠశాల ప్రత్యేక అధికారి పి.సునీతారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

హుజూర్‌నగర్ : ఆల్బెండజోల్ మాత్రలు వేసి చిన్నారుల్లో నులిపురుగులను నివారించవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌నాయక్ అన్నారు. సోమవారం నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పద్మ, పీఎస్ఓ నూర్జహాన్ బేగం, హెచ్ఎం శ్రీనివాస్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, సూపర్‌వైజర్ పద్మ, ఆరోగ్య కార్యకర్తలు ఐ.రామకృష్ణ, వి.శ్రీనివాస్, రాజశేఖర్ ఆశా సీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలి

గరిడేపల్లి : నులిపురుగుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని తహసీల్దార్ కవిత, మండల వైద్యాధికారి వి.నరేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గరిడేపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వారు ఆల్బెండజోల్ మాత్రలు వేసి మాట్లాడారు. ఎంపీడీఓ సరోజ, ఎంఈఓ చత్రునాయక్, ఎంపీఓ ఇబ్రహీం, హెల్త్ సూపర్‌వైజర్స్ అంజయ్యగౌడ్, వెంకటరమణ, ఏపీఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

మేళ్లచెరువు : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మేళ్లచెరువులో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో విద్యార్థులకు మాత్రలు మింగించారు. డాక్టర్ సీతామహలక్ష్మి, రాజ్‌కుమార్, వినోద, రాములు ఏఎన్ఎంలు , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

నడిగూడెం : మండల కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యసిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో స్థానిక పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హరినాథ్, విస్తరణాధికారి చంద్రశేఖర్‌రాజు, సూపర్‌వైజర్ కృష్ణమూర్తి, ఏఎన్ఎంలు సుజాత, రాధ, ఆశా కార్యకర్తలు శ్రీలక్ష్మి, లక్ష్మి, సైదమ్మ, సునిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నడిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది

పరిశుభ్రతతో నులిపురుగుల నివారణ

నేరేడుచర్ల : పరిశుభ్రతతో విద్యార్థుల్లో నులిపురుగులను నియంత్రించవచ్చని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని పున్నా నాగిని అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డితో కలిసి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. దిర్శించర్లలోని ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, పీహెచ్‌సీ సీహెచ్ఓ సల్వాది శ్రీనివాస్, మధు, నర్సయ్య, సునిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావిపహాడ్‌లో ర్యాలీ

మోతె : మండల కేంద్రంతో పాటు రావిపహాడ్, సిరికొండ, మామిళ్లగూడెం, ఉర్లుగొండ, నామవరం గ్రామాల ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ పిల్లలు, టీచర్లతో కలిసి వైద్యసిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ యశ్వంత్ మాట్లాడారు. పల్లె దవాఖానల డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : జెడ్పీహెచ్ఎస్‌లో..



మునగాల : కస్తూరిబా విద్యాలయంలో..

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ధర్నా



కోదాడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కోదాడ : బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ముల్కలపల్లి రాములు కోరారు. ఈమేరకు సోమవారం కోదాడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లను బీజేపీ కావాలనే అడ్డుకుంటుందని అన్నారు. రిజర్వేషన్ల సాధన కోసం బీసీలంతా ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జుట్టుకొండ బసవయ్య, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, ఎం.ముత్యాలు, దేవరం వెంకటరెడ్డి, వెంకటయ్య, దాసరి శ్రీను, రహిమాన్, సాయి, రాముడు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మకు బోనాలు



రాఘవాపురంలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

మోతె : మండలంలోని రాఘవాపురం గ్రామంలో సోమవారం ముత్యాలమ్మ బోనాల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు తలపై ఎత్తుకొని డప్పుచప్పుళ్ల నడుము ఆటాపాటలతో ఊరేగింపుగా అమ్మవారి దేవాలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు గ్రామ దేవతలకు కోళ్లు, యాటలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కొరుపెల్లి విక్రమ్, నరసయ్య, సతీష్, సైదులు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, పాఠశాలల్లోకి వర్షపునీరు



ఇంట్లోకి చేరిన వర్షపునీరు

నడిగూడెం : మండల వ్యాపంగా సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని చెరువులు అలుగు పోశాయి. వాగులు పొంగిపొర్లాయి. నడిగూడెం, చాకిరాల, రత్నవరం గ్రామాల సమీపాన వరి పొలాలు నీట మునిగాయి. కాగితరామచంద్రాపురంలోని ఎస్సీ కాలనీలో పలువురి ఇళ్లల్లోకి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆవరణలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు.

వికసించిన బ్రహ్మకమలం



మేళ్లచెరువు : మండలంలోని రామాపురం గ్రామంలో రంగిశెట్టి కవితసైదయ్య ఇంట్లో బ్రహ్మకమలం పుష్పం సోమవారం వికసించింది. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనందం వ్యక్తం చేశారు.

లక్ష్మారెడ్డికి నివాళి

మునగాల : మండలంలోని కోదండరామాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొబ్బిలి లక్ష్మారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం లక్ష్మారెడ్డి మృతదేహాన్ని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ జాతర తేదీలు ఖరారు

హుజూర్‌నగర్ : పొంచెర్ల (హుజూర్‌నగర్)లో ప్రతి ఏటా నిర్వహించే ముత్యాలమ్మ జాతర తేదీలు ఖరారయ్యాయి. సోమవారం జాతర నిర్వహణ కమిటీ, గ్రామ పెద్దలు కలిసి పట్టణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ తల్లులు (ముసలి ముత్యాలమ్మ, వయసు ముత్యాలమ్మ.) జాతరను 17, 18 తేదీల్లో నిర్వహించాలని, కనకదుర్గమ్మ జాతరను 21వ తేదీన నిర్వహించాలని వారు నిర్ణయించారు. సమావేశంలో జాతర నిర్వహణ కమిటీ, గ్రామ పెద్దలు, పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

హుజూర్‌నగర్ : పట్టణంలో త్వరలో జరగనున్న ముత్యాలమ్మ జాతరను ప్రజలంతా కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ చరమందరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ముత్యాలమ్మ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే ముత్యాలమ్మ జాతర, 21న జరిగే కనదుర్గమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని కోరారు. జాతరలో రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మికతకు సంబంధించిన ఫ్లెక్సీలు పెట్టవద్దని, జాతరలో డీజేలకు అనుమతి లేదని ఆయన పేర్కొన్నారు. జాతరలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన అనంతరం గోపూజ చేశారు. ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కోదాడరూరల్ : నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని పాలెం రజిని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. మండలంలో అర్హులైన రైతులు పట్టాదారు, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో ఈనెల 13 లోపు వ్యవసాయాధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

మఠంపల్లి : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై (హర్ ఘర్ తిరంగా) జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటశివ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు గుండెపంగు కొండలు, బొబ్బావీరారెడ్డి, అమరయ్య, గోపాల్‌యాదవ్, తుల్జానాయక్, నాగునాయక్, సైదానాయక్, భీమానాయక్, బాలునాయక్, కోటేశ్వరరావు, వీరయ్య, పుష్పలత, నరసింహారెడ్డి, కవిత, ఏసుపాదం, తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టులు అందజేత



విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ పద్మ

మేళ్లచెరువు : మండలంలోని రామాపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు సోమవారం టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవినాయక్, ఉపాధ్యాయులు రవిందర్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి మునగాలలోని హరిజన కాలనీలో పోలీస్ కళాబృందం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికావద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఆడపిల్లలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే సూర్యాపేట షీటీమ్ నంబర్ 87126 86056కు సమాచారం ఇస్తే మీ వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది వీరబాబు, శివ, కాలనీ పెద్దలు, కళాబృందం ఇంచార్జి యెల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి, నాగార్జున పాల్గొన్నారు.